


> సరూర్‌నగర్‌లో ఆడిట్ రికార్డుల ప్రకారం చనిపోయిన 102 మంది ఖాతాల్లో రూ. 16.75లక్షలు కొన్ని నెలల పాటు పెన్షన్‌గా జమ చేసినట్లు తేలింది. అలాగే అబ్దుల్లాపూర్‌మెట్‌లో చనిపోయిన 14మందికి రూ.4.08 లక్షలు పెన్షన్‌ను వారి ఖాతాల్లో జమ చేశారు. కొందరు లబ్ధిదారులు చనిపోయిన తరువాత 39నెలల పాటు పెన్షన్ ఇచ్చారు.

ఆసరాలో అక్రమాలు!

కాగ్ నివేదికలో వెల్లడి.. నగర శివార్లలో భారీగా అవకతవకలు

విలాసవంతమైన కార్లు ఉన్న వారికీ పింఛన్లు.. చనిపోయిన వారి ఖాతాల్లోనూ కొన్ని నెలల పాటు జమ

పేదలకు ప్రభుత్వ పథకాలు అందించాలంటే సవాలక్ష ప్రశ్నలు వేసి అంతకంటే ఎక్కువ పత్రాలు అడిగే అధికారులు పెద్దల విషయంలో మాత్రం పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు. అర్హులకు పథకాలు అందించే విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నా అనర్హులకు అందించే విషయంలో మాత్రం ముందుంటున్నారు. ఆసరా పింఛన్ల పంపిణీలో ఇలాంటి అవకతవకలే జరిగినట్టు కాగ్ బయటపెట్టింది. లక్షాధికారులకు కూడా పెన్షన్లు అందజేసినట్టు గుర్తించింది. ఇందులో మరో ట్విస్టు ఏంటంటే చనిపోయిన వారి పేరు మీద కూడా కొన్ని నెలలుగా పింఛన్లు అందజేస్తూనే ఉన్నారు. కాగ్ ఈ వ్యవహారాన్ని బయట పెట్టిన తర్వాతనైనా అధికారుల్లో మార్పు వస్తుందా.. ఈ అవకతవకలకు ఇప్పటికైనా ఫుల్‌స్టాప్ పడుతుందా.. వేచి చూడాలి మరి.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఆసరా పెన్షన్లలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్) ఇచ్చిన నివేదికలో వివిధ ప్రభుత్వ పథకాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలు బయటపడ్డాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలో ఆసరా పెన్షన్ల పంపిణీలో భారీగా అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయింది. ఆసరా పెన్షన్ల పంపిణీపై రాష్ట్రంలోని పలు మండలాల్లో 2018 నుంచి 2021 వరకు ఆడిట్ తనిఖీలు నిర్వహించగా అక్రమాలు బయటపడ్డాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు మండలాల్లో మచ్చుకు కొన్ని ప్రాంతాలను తనిఖీ చేయగా ఇక్కడ ఆసరా పెన్షన్లలో అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. కుటుంబ సర్వే వివరాలతో ఆసరా పెన్షన్ల డేటాను సరిచూడగా సుమారు 16శాతం కుటుంబాలకు అర్హత లేకున్నా పెన్షన్లు ఇస్తున్నట్లు వెల్లడైంది. చనిపోయిన వారికీ ఏడాదికి పైగా పెన్షన్లు ఇచ్చిన విషయాలు బయటపడ్డాయి. అలాగే రైతుబంధు డేటాను , ఆసరా డేటాతో పరిశీలించగా ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిమితికి మించి భారీగా భూములున్న వారికి కూడా పెన్షన్లు ఇచ్చారు. అనేక చోట్ల భారీగా ఆస్తులతో పాటు ఏడాదిలో రూ.10లక్షలకు పైగా బ్యాంకు లావాదేవీలు నిర్వహించిన వారు కూడా పెన్షన్లు పొందుతున్నట్లు తేలింది. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా జరిగిన భూముల క్రయ విక్రయాలు పరిశీలించగా రూ.10లక్షలకు మించి ఆస్తుల క్రయ విక్రయాలు చేసిన వారికి కూడా పెన్షన్ ఇస్తున్న విషయం బయటపడింది. అలాగే విలాసవంతమైన నాలుగు చక్రాల వాహనాలున్న వారు కూడా ఆసరా పెన్షన్లు పొందుతున్నారు. సరూర్‌నగర్‌లో ఆడిట్ రికార్డుల ప్రకారం చనిపోయిన 102 మంది ఖాతాల్లో రూ. 16.75లక్షలు కొన్ని నెలల పాటు పెన్షన్‌గా జమ చేసినట్లు తేలింది. అలాగే అబ్దుల్లాపూర్‌మెట్‌లో చనిపోయిన 14మందికి రూ.4.08 లక్షలు పెన్షన్ కింద వారి ఖాతాల్లో జమ చేశారు. కొందరు లబ్ధిదారులు చనిపోయిన తరువాత 39నెలల పాటు పెన్షన్ ఇవ్వడం గమనార్హం. ఈ విషయం బయటపడిన తరువాత కూడా రికవరీ చేసేందుకు ప్రయత్నించ లేదు. ఇలాంటి విషయాలను పరిశీలించి రికవరీ చేయడానికి యంత్రాంగం లేదని అధికారులు కాగ్‌కు వివరణ ఇవ్వడం మరింత ఆశ్చర్యానికి గురిచేసే విషయం. సాధారణంగా లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకుని పెన్షన్ ఇస్తుంటారు. ఏదైనా కారణం చేత వేలిముద్రలు స్కాన్ కాకపోతే స్థానిక పంచాయతీ కార్యదర్శి లేదా బిల్ కలెక్టర్ బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తుంటారు. కానీ కొందరు లబ్ధిదారుల విషయంలో ఏడు నెలల నుంచి 30నెలల పాటు వేలి ముద్రలు విఫలమైనట్లు చూపించి పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్రల ద్వారా భారీగా పింఛను డబ్బులు డ్రాచేసినట్లు తెలిసింది. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు ఇలా తమ ధ్రువీకరణ ద్వారా చేసిన చెల్లింపులకు సంబంధించి రుజువుగా అక్విటెన్స్ రిజిస్టర్ రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలి. కానీ ఈ రిజిస్టర్‌లో వివరాలు నమోదు ఎక్కడా సరిగా నిర్వహించలేదు. ఇందువల్ల వీటి వెనుక అవతవకలు జరిగినట్లు అనుమానిస్తూ విచారణ చేయాలని సూచించారు. అనర్హులకు నిబంధనలకు విరుద్ధంగా చేసిన చెల్లింపులను రాబట్టాలని పేర్కొంది. అలాగే కొత్త లబ్ధిదారుల ఎంపికలో కూడా సరైన విధానాలు అవలంబించలేదని 'కాగ్' ఆక్షేపించింది. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో లోపాలు ఉన్నట్లు తెలిపింది.



సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

మోదీ పథకాలు చరిత్రాత్మకం

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు

చేవెళ్ల, ఫిబ్రవరి 21 : దేశంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చరిత్రాత్మకమని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. బీజేపీ సంకల్ప యాత్ర బుధవారం రాత్రి చేవెళ్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తున్న నాయకుడు మోదీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం బీజేపీ ఖాతాలో చేరే విధంగా ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వాదించాలని కోరారు. 500 సంవత్సరాల దేశ ప్రజల కల శ్రీరామ మందిర నిర్మాణం పూర్తి చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. మోదీని ఓడించాలని కుట్రలు పన్నుతున్న కుటుంబ పార్టీలకు ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్ రమణారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగర వేసేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. చేవెళ్ల మీదుగా వెళ్లే హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం ఆమోదం తెలిపితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం సక్రమంగా భూసేకరణ చేయలేదన్నారు. సమాజంలో మార్పు రావాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకులు రాణిరుద్రమదేవి, అందెల శ్రీరాములు, ప్రతాపరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జంగారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కంజర్ల ప్రకాశ్, విఠల్‌రెడ్డి, రమణారెడ్డి, చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండవగా ధ్వజారోహణం

- ప్రతీ వ్యక్తి భక్తిభావం కలిగి ఉండాలి
- సమతాకుంభ్ ద్వితీయ బ్రహ్మోత్సవాల్లో చిన జీయర్‌స్వామి



ధ్వజారోహణలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చిన జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 : ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో నిర్వహిస్తున్న సమతాకుంభ్ బ్రహ్మోత్సవాలు రెండవ రోజు బుధవారం ధ్వజారోహణం కనుల పండవగా సాగింది, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు రామానుజ చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో బుధవారం ఉదయం అష్టాక్షరి మంత్ర జపంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. యాగశాలలో వేద పండితుల మంత్రోచ్ఛరణతో సేవాకాలం, శాత్తు ముఱై , అగ్ని ప్రతిష్ట వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివ్య సాకేతంలోని శ్రీరామచంద్రుడికి సూర్యప్రభ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి భక్తి భావం కలిగి ఉండాలని, మానవ సేవయే మాధవ సేవ అని చెప్పారు. దైవ చింతనతో మనిషికి మనశ్శాంతి ఉంటుందని చెప్పారు. అనంతరం భక్తులకు చిన జీయర్‌స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం వేద పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అకట్టుకున్నాయి. భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్
- సివిల్ సప్లయ్, వంట గ్యాస్ గోదాంల తనిఖీ
- కిస్మత్‌పూర్ పౌరసరఫరాల గిడ్డంగి తనిఖీలో 37 బస్తాల బియ్యం తేడా



బుద్వేల్‌లో వంట గ్యాస్ సిలిండర్లను పరిశీలిస్తున్న రఘునందన్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 21: అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. బుధవారం జిల్లాలోని పౌరసరఫరాల గోదాంలు, హెచ్‌పీ, భారత్ గ్యాస్ గోదాంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిస్మత్‌పూర్‌లోని పౌరసరఫరాల గోదాంలో బియ్యం స్టాక్‌ను తనిఖీ చేశారు. 37 బియ్యం బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. 10 నెలల నుంచి గోదాం నిర్వాహకుడు బియ్యానికి సంబంధించి రీ క్యాన్సిలేషన్ లెక్కలు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని రఘునందన్ తెలిపారు. ఆయనపై చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో డీటీ పఠాన్ హైదర్ అలీఖాన్‌తో పాటు రాష్ట్ర విజిలెన్స్ బృందం అధికారులు రాందాస్, కమాల్ పాష పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తే.. ఏజెన్సీ అనుమతి రద్దు ఖాయం

గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టిస్తే సంబంధిత ఏజెన్సీల అనుమతి రద్దు చేయడం ఖాయమని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ అన్నారు. బుధవారం ఆయన రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, బండ్లగూడ జాగీర్‌లో గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రశీదులు లేకుండా డెలివరీ చేయడాన్ని గుర్తించారు. గ్యాస్ గోదాముల్లో సిలిండర్ల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లలో ఉన్న గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వాడే సిలిండర్లలోకి మార్చి కొందరు గుట్టుగా దందా చేస్తున్నట్లు సమాచారం ఉండటంతో తనిఖీలను ముమ్మరం చేస్తున్నామన్నారు. గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్ తరలింపుపై నిఘా పెట్టామన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

కొడంగల్‌కు ఉజ్వల భవిష్యత్

- ఎన్నికల తర్వాత కొడంగల్ అభివృద్ధికి మరో రూ.500 కోట్లు
- సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి



బహిరంగ సభకు హాజరైన ప్రజలు

కొడంగల్, ఫిబ్రవరి 21: అన్నీ రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతం అభివృద్ధి పథంతో ఉజ్వల భవిష్యత్‌ను సంతరించుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో బుధవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వారితో మాట్లాడారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి విడతగా కొడంగల్ ప్రాంతానికి భారీ నిధుల మంజూరుతో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు ఈ ప్రాంత బిడ్డగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలతో రెండేళ్లలో సాగు నీరస్తామన్నారు. వికారాబాద్ జిల్లా పూడూర్ ప్రాంతంలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న నేవీ రాడార్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో పాటు కొడంగల్ నుంచి అత్యధిక మెజార్టీ అందించాలన్నారు. ఎన్నికల అనంతరం తిరిగి కొడంగల్ అభివృద్ధికి మరో రూ.500 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం సీఎం అంటూ నినాదాలు

కోస్గి పర్యటన ముగించుకొని సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ మీదుగా వెళ్తున్నారనే సమాచారంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో గుమిగూడారు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకోగానే కార్యకర్తలు సీఎం సీఎం అంటూ నినాదాలు చేశారు. దీంతో రేవంత్‌రెడ్డి తన కాన్వాయ్‌ను ఆపి అభివాదం చేశారు.



ముచ్చర్లలో పనులను పరిశీలిస్తున్న ఎన్ఐఆర్‌డీ అధికారులు

ఉపాధి పనులపై అవగాహన కల్పించాలి

- ఎన్ఐఆర్‌డీ శిక్షణ అధికారులు

కందుకూరు,ఫిబ్రవరి 21: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పనులపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఎన్ఆర్ఐడీ శిక్షణ అధికారులు కోరారు. మూడు రోజుల పాటు రాజేంద్రనగర్‌లో శిక్షణ పొందుతున్న ఎన్ఆర్ఐడీ అధికారులు బుధవారం ఒక్క రోజు క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా మండలంలోని ముచ్చర్ల, దాసర్లపల్లిలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టిన పల్లె ప్రకృతి వనం, శ్మశానవాటిక, కిచెన్ షెడ్డు పనులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్, మాజీ సర్పంచ్ రాంచంద్రారెడ్డి, దాసర్లపల్లి ఎంపీటీసీ సభ్యురాలు ఇందిరా దేవేందర్, డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సుభాషిణి, ఏపీడీ సక్రియ, ఎంపీడీవో సరిత, ఏపీవో ఎన్ను రవీందర్‌రెడ్డి, ఏపీఎం కవిత, ఈసీ సుగుణ, శ్వేత, టీఏలు రవికుమార్, గోవర్ధన్. గోపాల్, తిరుపతిరావు, బి.బాల్‌రెడ్డి, శోభారాణి, పంచాయతీ కార్యదర్శి ఇంద్ర సేనారెడ్డి, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలకు అసౌకర్యాల రోగం

- ఇరుకైన గదులు.. వసతుల లేమి
- రోగులకు వైద్యం చేసేందుకు తంటాలు పడుతున్న పల్లె వైద్యులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఇరుకు గదిలో చిన్నతూండ్ల పల్లెదవాఖానా

యాచారం, ఫిబ్రవరి 21 : పేదలకు మెరుగైన వైద్య సేవలందించడం కోసం కేంద్ర ప్రభుత్వం మారుమూల గ్రామాలలో (పల్లె దవాఖానా) ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటు చేసింది. యాచారం మండలంలోని చిన్నతూండ్ల, కుర్మిద్ద, మేడిపల్లి, మాల్, నల్లవెల్లి, చింతపట్ల, కొత్తపల్లి గ్రామాల్లో కూడా ఇవి రెండేళ్ల క్రితం ఏర్పాటయ్యాయి. వీటిలో ఒక డాక్టర్, ఆశా వర్కర్ అందుబాటులో ఉండి గర్భిణులు, బాలింతలు, ఇతర రోగులకు సేవలందిస్తున్నారు. అయితే, కొత్తపల్లి మినహా మిగిలిన గ్రామాల్లోని దవాఖానాల్లో సిబ్బంది అంతా మహిళలే ఉన్నారు. మూత్రశాలలు, మరుగు దొడ్లు లేకపోవడంతో ఇక్కడి సిబ్బందితో పాటు చికిత్స కోసం వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నతూండ్ల, కుర్మిద్ద, మేడిపల్లి, మాల్, నల్లవెల్లి, చింతపట్ల, కొత్తపల్లిలో ఇరుకుగా ఉన్న గదుల్లో పల్లెదవాఖానాలున్నాయి. వీటిలో ఏ ఒక్క దానికీ కనీసం విద్యుత్ వసతి కూడా లేదు. చిన్నపాటి కిటికీలుండడంతో వెలుతురు కూడా సరిగా లేకపోవడంతో రోగులకు చికిత్స చేయడానికి వైద్యులు నానా తంటాలు పడుతున్నారు. నిరుపయోగంగా ఉన్న మేడిపల్లి హాస్టల్ భవనంలోకి ఆ గ్రామంలోని పల్లె దవాఖానను మార్చితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా వీటికి విద్యుత్, నీటి వసతి కల్పిస్తే రోగులకు, వైద్యులకు అనువుగా ఉంటుందని ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇటీవల కొత్తపల్లి పల్లె దవాఖానాలో డాక్టర్ త్రుటిలో పాముకాటు నుంచి బయటపడ్డారు. ఈ ఆసుపత్రి గ్రామానికి దూరంగా ఉండడంతో తరచూ విషసర్పాలు వస్తున్నట్లు రోగులు చెప్పారు. దవాఖానాల్లో కనీసవసతులు లేవని తెలిపినా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇరుకు గదులతో ఇబ్బంది పడుతున్నాం



పల్లె దవాఖానాలు ఇరుకైన గదుల్లో ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. రోగులకు సరిగా సేవలందించలేక పోతున్నాం. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి కూడా లేకపోవడంతో ఇబ్బంది కలుగుతోంది. అధికారులు, ప్రభుత్వం ఈ దవాఖానాలకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

- డాక్టర్ చరిత, చిన్నతూండ్ల పల్లె దవాఖానా వైద్యురాలు



నక్కలపల్లిలో వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 21: రైతులు పీఎం కిసాన్ యోజన పథకం పొందాలంటే తప్పనిసరిగా ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. బుధవారం ఆమె మండల వ్యవసాయ అధికారి రాఘమ్మతో కలిసి నక్కలపల్లి, తోలుకట్ట గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు. రైతులకు సాగు విషయంలో తగు సూచనలు చేశారు. అనంతరం గీతారెడ్డి మాట్లాడుతూ రైతులు ఈ కేవైసీ నమోదు చేసుకోకపోతే నష్టపోతారన్నారు. మొయినాబాద్ మండలంలో ఇంకా 150మంది రైతులు ఈ కేవైసీ నమోదు చేసుకోలేదని త్వరగా చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వరిసాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అధికారుల సలహాలను కూడా స్వీకరించాలని సూచించారు. పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



డీపీఆర్‌వోను శాలువాతో సత్కరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 21: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పని చేసినప్పుడే విధి నిర్వహణలో సంతృప్తి కలుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం గద్వాల్ జిల్లాకు బదిలీపై వెళ్లిన జిల్లా పౌర సంబంధాల అధికారి మమ్మద్ ఆరిఫుద్దీన్‌కు పాత్రికేయులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అధికారులు, పాత్రికేయులతో సమన్వయం చేసుకుని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో డీపీఆర్‌వో ఆరిఫుద్దీన్ కృషి అభినందనీయమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాత్రికేయులను సమన్వయపరచుకొని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తన విధులను నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ, సహాయ పౌర సంబంధాల అధికారి ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, సతీష్ కుమార్, నాగలక్ష్మి, దస్తమ్మ పాత్రికేయులు పాల్గొన్నారు.

రైతులను అరెస్టు చేయడం సరికాదు


పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అప్పాయిపల్లి రైతులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 21: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో తమను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పలువురు రైతులు ఆరోపించారు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లిలో గల సర్వే నెం.19 భూములకు సంబంధించిన రైతులుబుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా తమ భూములను తీసుకోవద్దని చేస్తున్న ఉద్యమాన్ని నీరుగార్చే ఉద్దేశంతో కొంత మంది రెవెన్యూ, పోలీసు శాఖలతో కుమ్మక్కై ఆరుగురు రైతులను అరెస్టు చేయించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎరన్‌పల్లి శ్రీనివాస్, పకీరప్ప, నర్సప్ప, మోతిబాయి, దుబ్బ బాలప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

● ఎంపీపీ సత్యహరిశ్చంద్ర


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

కులకచర్ల, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తాయని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. కులకచర్ల చెరువు హనుమాన్ ఆలయంవద్ద బుధవారం ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డుపనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఎంపీటీసీ ఆనందం, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు వెంకటయ్యగౌడ్, వెంకటేశ్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు







మేడారం.. జన సంద్రం..

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చునని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలి ఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇంటర్మీడియట్, పదోతరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2024 నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సరంలో 65,965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షలు ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఇందుకోసం 231 పరీక్షా కేంద్రాలు కేటాయించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ 46,834 మంది, ప్రయివేటు 572 మంది మొత్తం 47,406 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఈఓ విజయలక్ష్మీ, ఇంటర్మీడియట్ విద్యాధికారి కిషన్ పాల్గొన్నారు.

సంగాయపల్లి అడవిలో ఆగని నరికివేత

● ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో విచారణ


అడవిలో నరికివేసిన చెట్లు

ధారూరు, ఫిబ్రవరి 21 : ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని సంగాయపల్లి బీట్‌లో అడవిలో చెట్లు నరికివేసిన ప్రాంతాన్ని ఆ శాఖ ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో పరిశీలించి, విచారణ జరిపిన (మంగళవారం) రోజు రాత్రే మరలా చెట్ల నరికివేత కొనసాగింది. రాస్నం అటవీ సెక్షన్‌లోని సంగాయపల్లి బీట్‌లో మంగళవారం రాత్రి పలువురు పెద్దపెద్ద చెట్లను నరికి కుప్పలు వేసి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహించకపోవటంతో రాత్రికి రాత్రే చెట్లను తొలగించి ఎండిపోయాక ఆ స్థలాన్ని చదును చేసుకుంటున్నారని తెలిసింది. అడవిని నరికిన వారిపై చర్యలు తీసుకునేందుకు అటవీశాఖ అధికారులు జంకుతున్నట్లు తెలుస్తోంది. వికారాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న ధారూరు అటవీ రేంజ్‌లో నరికివేత కొనసాగుతున్నా అటవీశాఖ జిల్లా అధికారులు ఇంతవరకు అటువైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. కాగా ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ జరిపినట్లు సమాచారం. ఎంత విస్తీర్ణంలో అడవిని నరికి దగ్ధం చేశారనే అంశంపై ఆయన విచారించినట్లు తెలిసింది. కొంత భాగాన్నే ఫారెస్టు రేంజ్ అధికారులు ఆయనకు చూయించి మిగతాది చూపించకుండానే పంపించారని విశ్వసనీయ సమాచారం. కాగా ఈ సంఘటనపై అటవీ అధికారులు పట్టింపులేనట్లుగా వ్యవహరించటం పలు అనుమానాలకు తావిస్తోంది. సరైన చర్యలు తీసుకోకపోతే అడవి మనుగడకు ప్రమాదం ఉందని పరిసర గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నేడు ఉప్పరిగూడ పీఏసీఎస్ విశ్వాస పరీక్ష

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21: ఇబ్రహీంపట్నం పరిధి ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి సంబంధించి నేడు (గురువారం) ప్రత్యేక సమావేశంలో విశ్వాసపరీక్ష జరుగనుంది. ఇటీవల వారిపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లుండగా ఐదుగురు బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ మద్దతుదారులున్నారు. కాంగ్రెస్ డైరెక్టర్లకు తోడు ఐదుగురు బీఆర్ఎస్ మద్దతుదారులు కూడా అవిశ్వాసం ప్రకటించడంతో డీసీవో ధాత్రీదేవి నేడు విశ్వాస పరీక్షకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈరోజు జరిగే ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలంటూ డైరెక్టర్లకు నోటీసులు అందజేశారు. ఉదయం 11. 30 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది.

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్


మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి, వీరేందర్‌గౌడ్,

మేడ్చల్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన కల్వకుంట్ల కుటుంబం జైలుకెళ్లడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని వెలికితీయడానికి కేంద్రం సహకారం కూడా ఉంటుందని వారు చెప్పారు. పాత బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేటలోని ఆ పార్టీ అర్బన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతో ఎట్టి పరిస్థితుల్లో పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డికి కప్పం కట్టాల్సిందేనని విమర్శించారు. ఈ నెల 24న బీజేపీ విజయ సంకల్ప యాత్ర మల్కాజిగిరి పార్లమెంటులోకి అడుగుపెడుతుందని, ఆ యాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు. ఆరోజు ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, 27న సికింద్రాబాద్ , కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో యాత్ర ఉంటుందని వారు వివరించారు. విజీత్‌వర్మ, ఆర్.కె.శ్రీనివాస్, పప్పు పటేల్, సంతోష్ పాల్గొన్నారు.

జననేంద్రియ వ్యాధులపై అవగాహన అవసరం


అవగాహన కార్యక్రమంలో ఉపాసన, డాక్టర్ రూమా సిన్హా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళల జననేంద్రియ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. పెయిర్ అకాడమీ, అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఓపెన్ ఎయిర్ యాంఫీ థియేటర్‌లో బుధవారం ఎండోమెట్రియోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ఎండోమెట్రియోసిస్ గర్భాశయం యొక్క లైనింగ్ లాంటి కణజాలం అని, ఇది గర్భాశయం వెలుపల పెరుగుతుందని తెలిపారు. మహిళలు ఆరోగ్య సమస్యలపై ఓపెన్‌గా మాట్లాడేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. సమాజంతో పాటు కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అపోలో ఆస్పత్రుల ఎంటర్‌ప్రైజెస్ సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని మాట్లాడుతూ.. మహిళలు తమ భావాలను వ్యక్తం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఎండోమెట్రియోసిస్ స్పెషలిస్టు డాక్టర్ రూమా సిన్హా, పేషెంట్ అకాడమీ ఫర్ ఇన్నోవేషన్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ రత్నాదేవి, డాక్టర్ కార్మాన్ నెజాట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న డీఈవో

వెల్దుర్తి(?) మినేపేట్... ఫిబ్రవరి 21 : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా గుణితాన్ని బోధించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. బుధవారం మండలంలోని అమ్రాదికలాన్, మల్లారెడ్డిగూడ పాఠశాలలను ఎంఈవో గోపాల్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూడికలు, తీసివేతలు, భాగాహారాలను సరళమైన పద్ధతిలో, అర్థమయ్యే విధంగా బోర్డుపై చెప్పాలన్నారు. ఏకోపాధ్యాయులు ప్రతీ రోజు పాఠశాలలకు హాజరు కావాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 21 : అధికారం పోయిందన్న ఆవేదనలో బీఆర్ఎస్ నేతలు నోటికి వచ్చినట్లు వాగుతున్నారని, మంగళవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమవేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. బుధవారం పీసీసీ సభ్యుడు మహమ్మద్ అలీఖాన్ బాబర్, గిరిజన సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, శ్రీను నాయక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తెస్తోందన్న అక్కసుతోనే ఆంధ్రజ్యోతి పత్రికపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని, అన్ని పత్రికలు నమస్తేతెలంగాణ లాగా గులాంగిరి వార్తలు రాయవని విమర్శించారు.

గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం

మాడ్గుల, ఫిబ్రవరి 21: మండలంలోని మారుమూల గ్రామాల అభివృద్ధే ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లక్ష్యం అని అందుగుల మాజీ సర్పంచ్ విజయలక్ష్మిరాజు అన్నారు. అందుగులకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని అడిగిన వెంటనే ఉపాధి నిధులు రూ.10లక్షలను ఎమ్మెల్యే మంజూరు చేశారని విజయలక్ష్మి తెలిపారు. రణంపల్లి రాజు ఇంటి నుంచి పిల్లి అలివేలు ఇంటి వరకు సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌గౌడ్, రమేష్, మహేష్, వెంకటయ్య, రాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనుల ప్రారంభంలో పాల్గొన్న గ్రామస్తులు

బాధ్యతలు స్వీకరించిన నూతన సీఐ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ విజయ్‌కుమార్

ఆమనగల్లు, ఫిబ్రవరి 21: ఆమనగల్లు సీఐగా వచ్చిన విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ వెంకటేశ్వర్లు సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. సైబర్ క్రైమ్ నుంచి విజయ్‌కుమార్ ఆమనగల్లు సీఐగా వచ్చారు. సర్కిల్ కార్యాలయంలో ఆయన చార్జి తీసుకున్నారు. ఆమనగల్లు, తలకొండపల్లి ఎస్ఐలు బాల్‌రామ్ నాయక్, శ్రీధర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు శాలువాలతో సత్కరించారు. విజయ్‌కుమార్‌ను కేఎన్నార్ యువసేన జిల్లా నాయకులు విజయ్‌రాథోడ్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

సమస్యలు పరిష్కరించుకుందాం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, ఫిబ్రవరి 21 : ఎమ్మెల్యే అని తాను ఎటువంటి అజమాయిషీ చూపనని.. ప్రజాప్రతినిధులు, అధికారులంతా మమేకమై సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తిమ్మాపూర్, ఆయా గ్రామాల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ చింతకింది రాజేందర్‌గౌడ్ కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రతీ మండలానికి 5వందల నూతన స్తంభాలను ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, త్వరలో నూతన వాటిని ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నడుం బిగించాలన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, ఎక్కడికక్కడ పైపులైన్లు పగిలి నీటిసరఫరా నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తూర్, నందిగామ మండలాల్లో కొన్ని గ్రామాలకు మూడేళ్లుగా తాగునీటి సరఫరా నిలిచిందని, ఇటీవల తాను అధికారులతో మాట్లాడి కొంత మేర పరిష్కరించానన్నారు. గత ప్రభుత్వం అధికారులను పట్టించుకోలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులకు స్వేచ్ఛనిస్తూ వారితో ప్రజా పనులు చేయిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రవీందర్‌రెడ్డి, ప్రసన్న, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, వ్యవసాయాధికారి గోపాల్, పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్, ఏఈలు సాయికృష్ణ, స్రవంతి, హేమంత్, రవీందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశానంతరం ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీవో శరత్‌చంద్రబాబును ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొత్తూరు పురపాలక సంఘం, వివిధ గ్రామాల వారికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి నగదు సాయంతో పాటు త్వరలోనే తులం బంగారం ఇచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్‌చైర్మన్ డి.రవీందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

రెడ్డిపాలెం, గుడూరు, తీగాపూర్ గ్రామాల్లో రూ.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ పద్మారావు, ప్రభాకర్, రాందాస్, దయానంద్, దర్శన్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుకుందాం : వీర్లపల్లి



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొత్తూర్ మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 2024-2025 మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని చైర్‌పర్సన్ బాతుక లావణ్య అధ్యక్షత నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. 2024-25కు 62.17కోట్ల ఆదాయం, 62.8కోట్ల వ్యయం, 8.73లక్షల మిగులు బడ్జెట్‌ను కమిషనర్ బాలాజీ ప్రవేశపెట్టగా, చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చకు త్వరలో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేందుకు తాను కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, వైస్‌చైర్మన్ డి.రవీందర్, కౌన్సిలర్లు నర్సింహాగౌడ్, కోస్గి శ్రీనివాస్, సోమ్లానాయక్, ప్రసన్నలత, సీహెచ్.చంద్రకళ, ఎం.హేమదేవేందర్, అనితశ్రీనివాస్, మాధవి గోపాల్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి



షాబాద్, ఫిబ్రవరి 21 : మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తామని పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వక్ అలీ అన్నారు. బుధవారం తెలంగాణ వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన అజ్మతుల్లాను నగరంలో అశ్వక్ కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రామేశ్వరం ఆలయంలో పంచాక్షరీ మంత్రం సౌండ్ సిస్టం ప్రారంభం



సౌండ్ సిస్టంను ప్రారంభిస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21: పవిత్ర పుణ్యక్షేత్రమైన రామేశ్వరంలో గల ఆలయంలో ఓం నమః శివాయ పంచాక్షరీ మంత్ర సౌండ్ సిస్టమ్‌ను బుధవారం ప్రారంభించారు. ఒగ్గు కిషోర్ మిత్రబృందం ఏర్పాటుచేసిన మైక్‌సెట్‌ను మాజీ ఎమ్మెల్యే బి.నర్సింహులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో శివకుమార్,కుమార్‌గౌడ్, శ్రీనివాస్, యాదగిరి, శ్రీశైలంగౌడ్, నవీన్, భూపాల్, చంద్రమౌళి పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు

యాచారం, ఫిబ్రవరి 21 : తక్కళ్లపల్లిగుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం గణపతి పూజ, దీపారాధన, ధ్వజారోహణ తదితర తొలిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. నేటి నుంచి జరిగే ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారని, వారి కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగక్కుండ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేను బెదిరించడం తగదు



మీడియాతో మాట్లాడుతున్న శ్రీను నాయక్

షాద్‌నగర్, ఫిబ్రవరి 21: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించం అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనునాయక్ హెచ్చరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిపై నందిగామ మండలానికి చెందిన రైతులు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, అందులో భాగంగానే అతడిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే.. ఎమ్మెల్యేనే అరెస్టు చేయించాడని నవీన్‌రెడ్డి అనడం సరికాదన్నారు.ఎమ్మెల్యేపై బెదిరింపు ధోరణితో మాట్లాడిని అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశా



వధువుకు చెక్కు అందజేస్తున్న వినీతకరుణాకర్‌గౌడ్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 21: తన సర్పంచ్ పదవీకాలంలో అప్పటి ప్రభుత్వం గ్రామానికి నిధులు కేటాయించకున్నా తన సొంత డబ్బు వెచ్చించి సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశానని బీజేపీ మండల మహిళ ఉపాధ్యక్షురాలు, రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బసగళ్ల వినీతకరుణాకర్‌గౌడ్ అన్నారు. గ్రామంలోని ప్రతీ ఆడబిడ్డ పెళ్లి ఖర్చుకు అమ్మ ట్రస్టు ద్వారా రూ.30వేల చొప్పున ఇచ్చి ఆదుకున్నానన్నారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పదవీకాలం పూర్తయినా కూడా ఆమె కొనసాగించారు. గ్రామానికి చెందిన మామిడి నిఖితకు అవినాష్‌రెడ్డితో బుధవారం వివాహం జరుగగా వేడుకకు వినీత హాజరై మండపం వద్దే రూ.30వేల (26వ) చెక్కును అందజేశారు. పేదలకు సాయం చేయడంలో ఉన్న తృప్తి దేనిలోనూ లేదన్నారు. గ్రామానికి, ప్రజలకు సేవ చేసేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌గౌడ్, యాదగిరి, దయానంద్‌గౌడ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి గ్రామస్తుల చేయూత

మాడ్గుల, ఫిబ్రవరి 21: అప్పారెడ్డిపల్లికి చెందిన పల్లేటి శ్రీను భార్య జానకి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఈ దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ పేద చిన్నారుల బాగోగుల కోసం గ్రామస్తులు రూ.3.5లక్షలు పోగుచేసి బుధవారం జానకి కుటుంబానికి అందజేశారు. గ్రామస్తులంతా తమకు తోచిన మొత్తంలో ఆర్థికసాయం చేశారు.

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిక



చెన్నారెడ్డిగూడలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు

మంచాల, ఫిబ్రవరి 21 : మండల పరిధి చెన్నారెడ్డిగూడలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం ప్యాక్స్ డైరెక్టర్ జె.వెంకటేష్, చీమల జంగయ్యయాదవ్, ఎం.వెంకటేష్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో చీమల శంకర్, గ్యార మహేష్, హర్యా, లచ్చిరాం, శ్రీకాంత్ ఉన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, లాలూ, పకీర, శ్రీశైలం, పి.రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం : ఎంపీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎంపీ రాములు

ఆమనగల్లు, ఫిబ్రవరి 21 : ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం అని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభీష్టానికనుగుణంగా పథకాలు రూపొందించి అమలు చేయాలని ఆయన కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో బుధవారం ఎంపీ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలుచోట్ల ఆలయాల నిర్మాణానికి, పేదల వైద్య చికిత్సలకు ఎంపీ రాములు ఆర్థిక సాయం అందజేశారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్ల రహదారిగా గామార్చాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం ఇచ్చానని తెలిపారు. జాతీయ రహదారిని త్వరలోనే విస్తరించడం జరుగుతుందని చెప్పారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరు గురించి కేంద్ర మంత్రులు, అధికారులకు విన్నవించినట్లు చెప్పారు. ఎంపీగా ఐదేళ్లుగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ భరత్‌కుమార్, నాయకులు గోపాల్‌రెడ్డి, అనంతరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

తలకొండపల్లి, ఫిబ్రవరి 21 : విద్యతోనే సమాజంలో మార్పు, చైతన్యం, ప్రగతి సాధ్యం అని తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకనుగుణంగా వసతులు కల్పించాలని కోరారు. తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి, పెద్దూరు తండాలో మండల పరిషత్ నిధుల నుంచి రూ.20లక్షలతో నిర్మించిన అదనపు గదులను బుధవారం జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు రఘునాయక్, సోనిలక్ష్య, రమేశ్, పెంటమ్మ రామస్వామి, ఆమనగల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరు కృషిచేయాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు దాతలు, పూర్వ విద్యార్థులు చేయూతనందించాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్, ఎంపీవో రఘు, స్పెషలాఫీసర్ రమేశ్‌నాయక్, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌యాదవ్, ప్రధానోపాధ్యాయులు అనురాధ, పవన్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జానయ్య, వాజిద్, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌నాయక్, లలితజ్యోతయ్య, సక్రి, కిషన్‌నాయక్, శంకర్‌నాయక్, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, చంద్రమౌళి, శంకరయ్య, మల్లేశ్, మధు, మహేశ్, శేఖర్, చంద్రారెడ్డి, వీరేశ్‌కుమార్, రవి, శ్రీను, యాదయ్య, రామలింగం, గ్రామస్తులు పాల్గొన్నారు.



తరగతి గదులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ, నాయకులు

వైభవంగా కొనసాగుతున్న లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, ఫిబ్రవరి 21: కడ్తాలలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివస్తూ స్వామి వారలకు పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు బుధవారం అర్చకులు వెంకటేశ్వరశర్మ, శ్రీధర్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ, వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు, లలితాసహస్ర నామార్చన, ఎదుర్కోళ్ల కార్యక్రమాలు నిర్వహించారు. రేపు నిర్వహించే కల్యాణోత్సవానికి ఉత్సవ కమిటీ చైర్మన్ టి.వేణుగోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం డీసీసీ అధికార ప్రతినిధి, జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించంచారు. వందలాదిగా భక్తులు తరలివస్తున్నారు. సాయంత్రం వరకూ నిర్విరామంగా పూజలు కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు సాయిరెడ్డి, చేగూరి వెంకటేశ్, యాదయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవేందర్, జంగారెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు, నాయకులు

భగవంతుడు సర్వాంతర్యామి



జ్యోతిర్లింగ పడిపూజ చేస్తున్న గురుస్వామి భూపాలచారి

కొందుర్గు, ఫిబ్రవరి, 21: భగవంతుడు సర్వాంతర్యామి అని గురుస్వామి భూపాలచారి అన్నారు. బుధవారం భైరంపల్లిలో జ్యోతిర్లింగ పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలచారి ఆధ్వర్యంలో శివస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. నియమనిష్ఠలతో దీక్ష చేపట్టాలన్నారు. కార్యక్రమంలో స్వాములు యాదయ్య, నర్సింలు, హన్మంత్‌రెడ్డి, రామకృష్ణ, బుగ్గయ్య, రవి, చిన్నయ్య, రామయ్య పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 106 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతీ కదలికలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయి కాబట్టి నేరాలు జరిగినప్పుడు దర్యాప్తునకు కెమెరాల ఫుటేజీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ వినాయకరెడ్డి, డీఐ నాగరాజు, ఎస్ఐ సంతోష్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్

కష్టంతో కాదు.. ఇష్టంతో చదవాలి



స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి

ఆదిబట్ల, ఫిబ్రవరి 21: పిల్లలకు సంస్కారం, సామాజిక విలువలతో కూడిన విద్య అందించాలని విద్యార్థి సంఘ నాయకుడు చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదిబట్ల పరిధి బొంగ్లూరులో గల ది మాస్టర్ మైండ్స్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా సబ్జెక్ట్‌పై ఇష్టపడి చదవితే పాఠ్యాంశంపై పట్టు సాధిస్తారని అన్నారు. ర్యాంక్‌ల కోసం కాకుండా సంస్కారం నైతిక విలువలతో కూడిన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో చదవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ చైర్మన్ రాజు సంగని, డైరెక్టర్ నాగరాజు, ప్రిన్సిపాల్ సుష్మారెడ్డి, కౌన్సిలర్ మౌనికఉదయ్ పాల్‌రెడ్డి, సునీతావెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమం

బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



యాచారంలో విజయ సంకల్ప యాత్ర వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం, ఫిబ్రవరి 21 : యాచారం మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి జరిగే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. బుధవారం విజయ సంకల్ప యాత్రకు సంబంధించిన ప్రచార పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అత్యధిక సీట్లలో గెలుపే లక్ష్యంగా పార్టీ ఈ యాత్రను నిర్వహిస్తోందన్నారు. మన మండల పరిధిలో నిర్వహించే యాత్రలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటెల రాజేందర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో మరో సారి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతీ కార్యకర్త ఎన్నికల వరకు నిరంతరం శ్రమించాలన్నారు. రాష్ట్రంలో యాత్రను అడ్డుకునేందుకు అధికార పార్టీ యత్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యకర్తలు సైనికులా పనిచేసి పార్టీ విజయానికి పాటుపడాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల నాయకులు కృష్ణ, గణేష్‌నాయక్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్, నాగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి 11 గుడిసెల దగ్ధం



మంటలార్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 21: గ్యాస్ సిలిండర్ పేలి 11గుడిసెలు దగ్ధమైన సంఘటన మోకిలలో బుధవారం చోటుచేసుకుంది. నానక్‌రామ్‌గూడ ఫైర్ స్టేషన్ అధికారి జగన్‌మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మోకిలలోని ప్రైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల కోసం విజేత సూపర్ మార్కెట్ వెనక 50 గుడిసెలు వేశారు. వాటిలో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలి 11 గుడిసెలు కాలిపోయాయి. రూ.3లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మనుషులకు ఎలాంటి హాని కలగలేదన్నారు. కంపెనీ యాజమాన్యం కార్మికులకు సదుపాయం కల్పించకే ప్రమాదం జరిగినట్లు స్థానికులు అన్నారు. ఎండకాలం ఉన్నందున ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే కార్మికులకు ప్రాణహాని పొంచి ఉందన్నారు.

అమ్మాయిని వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

శంకర్‌పల్లి ఫిబ్రవరి 21: అమ్మాయిని వేధించిన వ్యక్తికి 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం చేవెళ్ల కోర్టు తీర్పునిచ్చింది. శంకర్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లి గ్రామానికి చెందిన గుండాల శ్రీరామ్‌రెడ్డి(25) 2019లో మండల పరిధి యువతిని వేధించడంతో వారు శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీరామ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయ విచారణ చేసిన కోర్టు ఈ మేరకు శిక్షను ఖరారు చేసింది. బాధితురాలి తరపున నిందితుడిపై అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పించిన ఎస్సై లక్ష్మీనారాయణ, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్‌లను డీసీపీ శ్రీనివాస్ అభినందించారు.

నేడు 400 మంది వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21: షాద్‌నగర్ పట్టణ శివారులోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్స్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ గురువారం 400 మంది వృద్ధులకు దుప్పట్లు, ఇతర వస్తువులను పంపిణీ చేస్తుందని నిర్వాహకులు థామస్‌రెడ్డి తెలిపారు. సంస్థ ఆవరణలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు షాద్‌నగర్‌కు ప్రజా సంగ్రామ యాత్ర

షాద్‌నగర్, ఫిబ్రవరి 21 : బీజేపీ ఎంపీ, జాతీయ నాయకుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర గురువారం షాద్‌నగర్ పట్టణానికి చేరుకోనుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్తా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 6గంటలకు షాద్‌నగర్‌లోని ప్రధాన కూడలిలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని, భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడి మృతి

తలకొండపల్లి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని వెంకటాపూర్ తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సభావట్ బావోజీ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పరామర్శించారు. పార్టీకి బావోజీ చేసిన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి పార్టీ తరపున రూ.5వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు భాస్కర్, పవన్ ఉన్నారు.



బావోజీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు